

## జాడలేని లక్ష్మిత్

కంభం మండలం లింగోజిపల్లిలో మంగళ వారం అదృశ్యమైన పాదిలి లక్ష్మిత్ (3) ఆచూకీ ఇంకా దొరకలేదు. 5 ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

- 4లో..



## నీటికుంటలో పడి యువకుడు మృతి

ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి యువకుడు మృతిచెందిన ఘటన కురిచేడు మండలం అల వలపాడులో బుధవారం జరిగింది.

- 4లో..

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 27 /25

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

# న్యూస్‌రీల్

## బధిరుల సమస్యలను పరిష్కరించాలి



ఏడీ సువార్తకు వినతిపత్రం ఇస్తున్న బధిర సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని బధిరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బధిరుల సంఘ నాయకులు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సువార్తని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్క బధిరునికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో బధిరులకు రిజర్వేషన్ రోస్టర్‌ను తప్పక పాటించాలని కోరారు. బధిరులకు రుణాలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బధిర సంఘం అధ్యక్షుడు ఎం.రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి ఎం.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్గదర్శకులను త్వరగా గుర్తించాలి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ




మాట్లాడుతున్న గోపాల కృష్ణ

ఒంగోలు సబర్బన్: పీ–4 పథకం కింద మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలోని పురోగతిపై సమీక్షించేందుకు బుధవారం ఆయన ప్రకాశం భవనం నుంచి నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు, మండలాల స్పెషల్ ఆఫీసర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు కూడా తమ శక్తి మేరకు 'బంగారు కుటుంబాల'కు అండగా నిలిచేలా స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. తాను కూడా 10 కుటుంబాలను దత్తత తీసుకుంటానని చెప్పారు. ఈ నెలాఖరికే మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసేలా దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో సుమారు 75 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ప్రజా ప్రతినిధులను, ఉన్నత విద్యావంతులను, వ్యాపార, పారిశ్రామికవేత్తలను సంప్రదించి 'మార్గదర్శకులు'గా వారు ముందుకు వచ్చేలా చూడాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బో**ధన**లేక..

# సారోళ్లు తికమక!




మోడల్ ఇన్విటేషన్

పాఠశాలల్లో మామిడి తోరణాలు కట్టండి..టెంట్లు, కుర్చీలు వేయండి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించండి..విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యేలా చూడండి..ఇందు కోసం పటిష్ట ఏర్పాట్లు చేయండి. ఆహ్లాదకరమైన వాతావరణంలో మెగా పేరెంట్స్ మీట్ జరిగేలా చూడండి. సహ పంక్తి భోజనాలు ఏర్పాటు చేయండి.. ఇదీ ప్రభుత్వ పెద్దల నుంచి ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు, ప్రిన్సిపాళ్లకు వచ్చిన ఆదేశాలు. ఇచ్చిన నిధులేమో అత్తెసర.. మెనూ మాత్రం చాంతాడంత.. అరకొర నిధులతో సమావేశాలు నిర్వహించేందుకు వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు..

- సమావేశాల నిర్వహణకు చాంతాడంత మెనూ
- అరకొర నిధులతో ఎలా నిర్వహించాలి
- అవస్థలు పడుతున్న హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు
- పాఠశాల నిర్వహణ గ్రాంట్‌లో 10 శాతం వెచ్చించాలంటూ ఆదేశాలు
- క్లాస్‌రూమ్ వదిలి రోడ్డెక్కిన ఉపాధ్యాయులు
- జిల్లాలో 2,955 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 188 జూనియర్ కళాశాలల్లో సమావేశాలు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ఒంగోలు సిటీ:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కార్ పాఠశాలల అభివృద్ధి కుంటుపడింది. స్కూళ్ల అభివృద్ధికి తీసుకున్న చర్యలు శూన్యం. దీంతో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల నడుమ విద్యార్థులు చదువు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో ఏడాదిగా అభివృద్ధి కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. గత ఏడాది నవంబరులో టీచర్– పేరెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆ సమావేశాలకు వచ్చిన స్పందన కూడా అంతంత మాత్రంగానే ఉంది. పాలకుల హడావుడి తప్ప విద్యార్థులకు ఒనగూడిందేమీ లేదు. ఈ ఏడాది గురువారం ఈ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు సైతం సమీక్షలు నిర్వహించి సమావేశాలను అట్టహాసంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులు ఏ మాత్రం సరిపోవని, ఆ నిధులతో సమావేశాలు ఎలా నిర్వహించాలో అంటూ పాఠశాల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు తలలు పట్టుకుంటున్నారు.

**చాలీచాలనీ గ్రాంట్‌తో అవస్థలు:**

జిల్లాలోని మొత్తం 2,955 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 188 జూనియర్ కళాశాలల్లో సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఆయా స్కూళ్లల్లో పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం భారీగా నిధులు అవసరమవుతాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లకు ఈ ఏడాది మెయింటెనెన్స్ గ్రాంట్ రూ.5.87 కోట్లు ఇవ్వాల్సి ఉంది. పేరెంట్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వం హడావుడిగా రూ.2.91 కోట్లు విడుదల జేసింది. ప్రస్తుతం విడుదలజేసిన నిధుల నుంచి 10 శాతం ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం హైస్కూళ్లకు సుమారు రూ.2500, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.1250 వరకూ ఖర్చు చేయాలి వస్తుంది. ఇదిలా ఉండగా ఈ సమావేశాలకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలి. పూర్వ విద్యార్థులు, అక్కడ చదివి ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని కూడా ఆహ్వానించి సన్మానించాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫొటో సెషన్ నిర్వహించాలి. అమ్మ ప్రాముఖ్యతను తెలియజేసేలా తల్లికి వందనం నిర్వహించాలి. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా పోటీలు నిర్వహించాలి. తల్లిదండ్రులకు సైతం వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలి. మధ్యాహ్నం విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలి. ఇవన్నీ చేయాలంటే భారీగా డబ్బులు అవసరమవుతాయి. ప్రభుత్వం కేటాయించిన అరకొర డబ్బులు ఏమూలకూ సరిపోవని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు మల్లగుల్లాలు పడుతున్నారు.

**రోడ్డెక్కిన ఉపాధ్యాయులు..**

పేరెంట్– టీచర్స్ మీటింగ్ కార్యక్రమాలకు అతిథులను ఆహ్వానించేందుకు, ఏర్పాట్లు చేసేందుకు ఉపాధ్యాయులు క్లాసురూములు వదిలి రోడ్డెక్కారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడం మానేసి ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పేరిట డేటా

చాంతాడంత ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో పూర్తి చేస్తున్నారు. దీంతో విద్యాబోధన కుంటుపడుతుందని ఆందోళన చెందుతున్నారు.

**వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు**

**బేస్తవారిపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌పై వేరొక శాఖకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి పర్యవేక్షణ తప్పనిసరి అంటూ విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం గం.12.30 వరకూ మీటింగ్ జరుగుతుందీ లేనిదీ ఇతర శాఖ ఉద్యోగి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ ఉద్యోగి పేరెంట్స్ మీట్ రోజున 30 సెకన్ల వీడియో, నాలుగు ఫొటోలు, మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రధానోపాధ్యాయులు ఉపయోగిస్తున్న లీప్ యాప్‌లో సాక్షిగా వచ్చిన వ్యక్తి అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు షరతు విధించారు. తమపై వేరొక శాఖ ఉద్యోగి పర్యవేక్షణ చేయాలని చెప్పడం దారుణమని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

**కుంటుపడుతున్న బోధన**

పాఠశాలలు తెరిచిన నాటి నుంచి పాఠశాలల్లో సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. 1, 2 తరగతులకు 45 రోజులు, మిగిలిన ప్రాథమిక తరగతులకు 30 రోజులుగా అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఇంత వరకూ గమనిస్తే ప్రారంభంలో బదిలీలు, జాయినింగ్‌లు, రిలీవింగ్‌లతో 10 రోజులు గడిచిపోయాయి. తర్వాత గిన్నిస్ రికార్డు కోసం అంటూ యోగాంధ్ర కార్యక్రమాలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్లతో మరికొన్ని రోజులు గడిచాయి. జూలై 1 నుంచి పూర్తి స్థాయిలో బోధనపై దృష్టి పెడతామంటే మరో గిన్నిస్ రికార్డు పేరుతో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.ఓ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొక్కల కోసం విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, కమిటీల ఏర్పాటు, ఆహ్వానాలు, మండల స్థాయి నుంచి, పాఠశాల స్థాయి వరకూ ముందస్తు సమావేశాలతో ఉపాధ్యాయులు బిజీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడటంతో బోధనా కార్యక్రమాలు కుంటుపడినట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

**పచ్చపెత్తనం**

సరస్వతీ నిలయాల్లో పచ్చ పెత్తనం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల బాగోగులు చూడాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు సంబంధించి గత ఏడాది జరిగిన ఎన్నికల్లో సైతం టీడీపీ శ్రేణులు పేట్రేగిపోయాయి. కొన్నిచోట్ల ఏకంగా బెదిరింపుల పర్వానికి తెరదీశాయి. అధికార అహంకారంతో పోలీసులను అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడ్డాయి. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన తల్లిదండ్రులు ఎన్నికల్లో పోటీ చేయకుండా, ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్నాయి. ఏకంగా అధికారులపై దౌర్జన్యం చేసి ఏకగ్రీవమైన చోట కూడా ఎన్నికలను రద్దు చేయించాయి. ఎన్నడూ లేని విధంగా ఇలా జరగడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

## ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి



మాట్లాడుతున్న డీసీ హేమంత్ నాగరాజు

ఒంగోలు టౌన్: అధిక ధరలకు మద్యం విక్రయాలు చేయకుండా ఎక్సైజ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు ఆదేశించారు. స్థానిక డీసీ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 10 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు జరిగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాల్లో అన్నీ బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గంజాయితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం అరికట్టేందుకు గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. అనధికార మద్యం విక్రయాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. లోక్ అదాలత్‌ను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసులు ఉంటే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను త్వరితగతిన వేలం వేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు ఈ.వెంకట్, ఏ.జనార్దన్‌రావు, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

- ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న చంద్రబాబు సర్కార్
- సార్వత్రిక సమ్మెలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు హెచ్చరిక



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు టౌన్:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను దేశంలోని అన్నీ వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, తీరు మార్చుకోకుంటే మరింత ఉధృతంగా పోరాటాలను కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తుతున్న చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లకు అనుకూలంగా పనిగంటలను పెంచిందని మండిపడ్డారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డిపో నుంచి అద్దంకి బస్టాండు సెంటర్, మస్తాన్ దర్గా, ట్రంకు రోడ్డు, చర్చి సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ప్రకాశం భవనం వద్ద నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన దేశంలోని నిరుపేద ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ధనవంతులు, అవినీతిపరులు, అక్రమార్కులు మాత్రమే ఈ ప్రభుత్వం బ్రహ్మాండంగా ఉందని చెబుతున్నారని అన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. కనీసం మౌలిక వసతులను కూడా కల్పించలేని పరిస్థితిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. నిరుద్యోగం పెరిగిపోతుందని, విచ్చలవిడిగా అవినీతి జరుగుతుందని ధ్వజమెత్తారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ పాలనకు వ్యతిరేకంగా రూ.30 కోట్ల మంది ప్రజలు రోడ్డెక్కి పోరాడుతున్నారని తెలిపారు.

**కనీస వేతన చట్టాలు అమలు చేయాలి:**

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కనీస వేతన చట్టాలను అమలు చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మానుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కోసం దొడ్డిదారి ప్రయత్నాలు మానుకోకపోతే రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లు అమలులోకి వస్తే కార్మికులు తమ హక్కులను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, ఉద్యోగుల అభిప్రాయాలను లెక్కచేయకుండా ఏకపక్షంగా చట్టాలను మార్చడం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. ఉపాధిహామీ పనులను ఏడాదిలో 200 రోజులు నిర్వహించాలని, రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ యూనియన్ల నాయకులు అన్నపూర్ణ, మేరి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కీం వర్కర్లను తొలగించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్ష పార్టీ సమ్మెకు ఎస్‌డీపీఐ నాయకులు షేక్ సత్తార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్.లలిత కుమారి, బి.పద్మ, శ్రీరాం శ్రీనివాసరావు, జి.రమేష్, తంబి శ్రీనివాస్, ఎంఏ సాలార్, తాళ్లూరు వెంకటేశ్వర్లు, జె.ఉదయ కిరణ్, టి.విజయ, కేవీ సుబ్బమ్మ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చలేని బాబు సిగ్గుపడాలి

- సంతనూతలపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి
- భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు



బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు తదితరులు

నాగులుప్పలపాడు: ప్రజలకు నాలుగింతల మంచి చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి వాటిని నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు సిగ్గుపడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. ఒంగోలు విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా గొంతెత్తిన వారిపై అక్రమ కేసులు, జైళ్లలో పెడుతున్నా కార్యకర్తలు, నాయకులు ఏ మాత్రం భయపడకుండా మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారనడానికి ఈ సమావేశానికి వచ్చిన వేలాది మంది కార్యకర్తలే నిదర్శనమన్నారు. ఎన్నో హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తే వాటిని ప్రజల తరపున గొంతెత్తి మాట్లాడుతున్న జగన్‌మోహన్ రెడ్డి బయటకు వస్తే ఓ సంచలనంగా ఉందని, దీనిని చంద్రబాబు ప్రభుత్వం ఓర్చుకోలేక అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. పొగాకు రైతుల పక్షాన పోరాటం చేస్తే తట్టుకోలేని కూటమి నాయకులు ఆ సభలో రాళ్లు రువ్వి చేసిన గందరగోళం ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఎన్ని కూటములు ఏకమైనా, కుట్రలు చేసినా ప్రజాతీర్పు భవిష్యత్‌లో జగన్‌మోహన్ రెడ్డికే ఉందన్నారు. ఈ సారి జగన్ 2.0 పాలనలో కార్యకర్తలే కీలకంగా మారనున్నారన్నారు. తాను జిల్లా అధ్యక్షుడిగా ఉన్నంత కాలం గోతులు తీసే నాయకత్వం చేయనని, జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేద ప్రజల ప్రాణాలకు విలువ ఇస్తూ ఆనాడు పాదయాత్రలో డా.వైఎస్సార్ అమలు చేసిన 108, ఆరోగ్యశ్రీ అనేవి ఈనాటికీ ప్రజల్లో చిరస్థాయి గా నిలిచిపోయాయన్నారు. అలాంటి పాలనే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిలో చూశామని అన్నారు. రాబోయే రోజుల్లో మనం దరం కలిసికట్టుగా సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల్లో మేరుగు నాగార్జున, శివప్రసాద్ రెడ్డిలకు అండగా ఉండాలని కార్యకర్తలను కోరారు.

పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.మేరుగు నాగార్జున మాట్లాడుతూ తాను ఈ నియోజకవర్గానికి వచ్చాక ఈ ప్రాంతానికి మహానేత వైఎస్సార్ వలన జరిగిన మంచిని కళ్లారా చూశానని ఇలాంటి ప్రాంతానికి తాను సేవ చేసే భాగ్యం కల్పించిన జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞుడనన్నారు. మోసపూరిత హామీలతో గెలిచిన కూటమి నాయకులు నేడు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. తాను ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన పారిపోయే రకాన్ని కాదన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తను గుర్తుపెట్టుకొని భవిష్యత్ లో వారికి సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తానన్నారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ డొల్లతనం బయటపడిందన్నారు. హామీలేవీ అమలు చేయకుండా మోసగించిందన్నారు.

పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. ముసలోళ్లు కూడా బటన్ నొక్కుతారని ఎద్దేవా చేసిన చంద్రబాబు తన ముసలితనంలో బటన్ ఎందుకు నొక్కలేకపోతున్నాడో సమాధానం చెప్పాలన్నారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత వలన జగన్ కు వస్తున్న ఆదరణ చూసి అసలు అధికారంలో ఎవరున్నారో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారన్నారు.

మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ ఈవీఎంల ట్యాంపరింగ్ తో గెలిచిన కూటమి ప్రభుత్వం పై ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉందన్నారు.

అనంతరం త్వరలో క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించే క్యూఆర్ కోడ్ స్కానర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పాలడుగు రాజీవ్, వేమా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, మేధావుల సంఘం రాష్ట్ర సెక్రటరీ కంచర్ల సుధాకర్, మారెడ్డి సుబ్బారెడ్డి, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు మండల పరిషత్ అధ్యక్షుడు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వాకా అరుణ కోటిరెడ్డి, బుడంపాటి విజయ, యద్దనపూడి శ్రీనివాసరావు, మండలాధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, పోలవరపు శ్రీమన్నారాయణ, దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టిపాటి శేఖర్ రెడ్డి, తేళ్ల పుల్లారావు, బెజవాడ రాము, గుడ్డపాతల రవి, నారా విజయలక్ష్మి, నన్నపురెడ్డి రవణమ్మ, కాకర్లపూడి రజనీ, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన మేరుగు నాగార్జున



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

## క్లుప్తంగా

### నాన్ బెయిలబుల్ కేసులో నిందితుడు అరెస్టు

టంగుటూరు: నాన్ బెయిలబుల్ కేసులో నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కారుమంచి గ్రామానికి చెందిన దోనంపూడి అచ్చమ్మకు భర్త దోనంపూడి రమేష్ మెయింటెనెన్స్ భరణం చెల్లించాలి. కానీ చెల్లించకపోవడంతో అచ్చమ్మ కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది అరెస్టు చేసి ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ నెల రోజుల జైలుశిక్ష విధించారు.

### అక్రమ మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక ఎక్సైజ్ శాఖ సీఐ ఎం.జయరావు తన సిబ్బందితో కలిసి గ్రామంలో సోదాలు నిర్వహించగా ఓ వ్యక్తి 10 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. తనిఖీల్లో సిబ్బంది శ్రీపతి, ఆర్షాదుల్లా, శంకర్, హరిబాబు పాల్గొన్నారు.

### వక్ఫ్ భూముల్లో ఆక్రమణల తొలగింపు


ఆందోళన చేస్తున్న ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు

పొదిలి: వక్ఫ్ భూముల్లో ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. షెడ్లు ఏర్పాటు చేసుకుని, వాస్తవంగా నివాసం ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపుతామని చెప్పారు. ఇదిలా ఉండగా ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకుడు మోహన్‌ధర్మా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. నోటీసులు ఇవ్వకుండా నివాసాలు తొలగించడం సరికాదని, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### రోగులకు మెరుగైన సేవలందించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

మద్దిపాడు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్య శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవల వివరాలు, రోగుల రిజిష్టర్లు, రికార్డులు, క్యాజువాలిటీ రూం, అత్యవసర సేవా విభాగాన్ని, మెడిసిన్స్ భద్రపరుస్తున్న విధానాలను పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మూమెంట్ రిజిష్టర్, సిబ్బంది డ్యూటీ చార్ట్ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీఓ వి.జ్యోతి, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రావణ్, డాక్టర్ అన్వేష్, వైద్య శాఖ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# జాడ లేని లక్షిత్..

# పోలీసుల ముమ్మర గాలింపు


లక్షిత్ (ఫైల్)


బాలుడి చెప్పులు లభ్యమైన ప్రదేశంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్


పొలాల్లో బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్న గ్రామస్తులు

- రంగంలోకి దిగిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్
- 5 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్న పోలీసులు
- పంట పొలాల్లో నల్లవాగు సమీపంలో బాలుడి చెప్పులు లభ్యం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కంభం:

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోగా.. పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. కంభం మండలంలోని లింగోజిపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రం నుంచి బయటకు వచ్చిన మూడేళ్ల బాలుడు పొదిలి లక్షిత్ అదృశ్యమైన సంగతి తెలిసిందే. తొలిరోజు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ కె.మల్లికార్జున , ఎస్సై నరసింహారావు తమ సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరాలతో గ్రామ పరిసరాలను జల్లెడ పట్టినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో నల్లవాగు వద్ద బాలుడి చెప్పులను పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు భారీగా నల్లవాగు వద్దకు చేరుకుని వెదికినా ఫలితం లేకుండా పోయింది.

**ఆగంతకులు ఎత్తుకెళ్లారా?**

బాలుడి చెప్పులు వాగు వద్ద గుర్తించిన పోలీసులు ఒంగోలు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించారు. తొలుత పోలీస్ జాగిలం సంఘటనా స్థలం నుంచి నేరుగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వెళ్లి ఆగింది. రెండోసారి సంఘటనా స్థలం నుంచి నేరుగా సూరేపల్లి సమీపంలో కంభం–తర్లుపాడు రోడ్డుపైకి వచ్చి ఆగింది. సంఘటనా స్థలంలో క్లూస్ టీమ్ బృందం వేలిముద్రలు సేకరించింది. పోలీస్ జాగిలం వెళ్లిన మార్గాన్ని బట్టి చూస్తే ఆగంతకులు బాలుడిని తీసుకుని నల్లవాగు వెంబడి సూరేపల్లి వద్ద రోడ్డుపైకి చేరుకుని వాహనంలో వెళ్లిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాలుడిని తీసుకెళ్తున్న క్రమంలో వాగు వద్ద చెప్పులు జారి పడినట్లు తెలుస్తోంది.

**గాలింపు చర్యల్లో 5 బృందాలు**

బాలుడి అదృశ్యం కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు మార్కాపురం డీఎస్పీ నాగరాజు పర్యవేక్షణలో సీఐ కె.మల్లికార్జున ఆధ్వర్యంలో 5 బృందాలుగా ఏర్పడి కంభం, మార్కాపురం, తర్లుపాడు, గిద్దలూరు, పొదిలి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో గాలిస్తున్నారు. కొందరు కొత్త వ్యక్తులు చెత్త ఏరుకునేందుకు గ్రామంలోకి వచ్చారని గ్రామస్తులు చెబుతున్న నేపథ్యంలో ఆ కోణంలోనూ విచారిస్తున్నారు.


నల్లవాగు వెంట గాలిస్తున్న పోలీసు జాగిలం

**గొట్లగట్టులో విషాద ఛాయలు**

కొనకనమిట్ల: లక్షిత్ అదృశ్యం కావడంతో స్వగ్రామం కొనకనమిట్ల మండలం గొట్లగట్టులో విషాద ఛాయలు నెలకొన్నాయి. బాలుడి తండ్రి పొదిలి శ్రీను ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉండగా, ఇటీవల వరకు లక్షిత్ తన తల్లి సురేఖ, నానమ్మ తులశమ్మతో కలిసి గొట్లగట్టులో ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం లక్షిత్ అమ్మమ్మ స్వగ్రామమైన కంభం మండలం లింగోజిపల్లికి వెళ్లాడు. ఎంతో చలాకీగా ఉండే లక్షిత్ అదృశ్యం కావడంపై బంధువులతో పాటు గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. లక్షిత్ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా లక్షిత్ అదృశ్యమైన ఘటన గ్రామాల్లో చిన్న పిల్లలు ఉన్న తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది.


విషణ్ణ వదనంలో రిషిత్ బంధువులు

# ఎస్‌ఎంసీ చైర్మన్ అరాచకాలు తట్టుకోలేకపోతున్నాం

- మురికిమల్ల ఆశ్రమ పాఠశాల నుంచి బదిలీ చేయండి
- మూకుమ్మడిగా సెలవు పెట్టిన హెచ్‌ఎం, ఐదుగురు టీచర్లు
- డీటీడబ్ల్యూఓ వరలక్ష్మికి వినతి పత్రం అందజేత


డీటీడబ్ల్యూఓ వరలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: స్కూల్ మానిటరింగ్ కమిటీ(ఎస్‌ఎంసీ) చైర్మన్ అరాచకాలను తట్టుకోలేకపోతున్నామని, తమను మురికిమల్ల గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఎక్కడికైనా డిప్యుటేషన్‌పై బదిలీ చేయాలని కోరుతూ బుధవారం ఆ పాఠశాల హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు డీటీడబ్ల్యూఓ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. పుల్లలచెరువు మండలంలోని మాచర్ల హైవే రోడ్డుపై ఉన్న మురికిమల్ల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ బయ్యన్నతోపాటు మరో ఐదుగురు ఉపాధ్యాయులు మూకుమ్మడిగా సెలవుపెట్టి ఒంగోలు వెళ్లారు. అక్కడ డీటీడబ్ల్యూఓ కార్యాలయంలో తమ గోడును లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ అనుమతి లేకుండా తాము పాఠశాలలోకి వెళ్లేందుకు వీలులేదని, రోజూ రోడ్డుపై నిల్చుని నమస్కారం చేసి పాఠశాలలోకి వెళ్లాలని చెబుతున్నాడని, ఆయన అనుమతి లేకుండా న్యూఅడ్మిషన్స్ చేర్చుకోవద్దని హుకుం జారీ చేస్తున్నాడని వినతి పత్రంలో ఉపాధ్యాయులు ఆరోపించారు. తనకు ఇష్టం వచ్చినప్పుడల్లా పాఠశాలలోకి వచ్చి ఫొటోలు, వీడియోలు తీస్తుంటాడని, క్లాస్ రూంలోకి వెళ్లి టీచర్‌ను బయటికి పంపి తానే క్లాస్ తీసుకుంటాడని, విద్యార్థుల ఎదుట హెచ్‌ఎంను, ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడుతున్నాడని డీటీడబ్ల్యూఓ దృష్టికి తీసుకెళ్లారు. వర్కర్స్‌ను బెదిరించి స్టోర్ రూంలోకి వెళ్లి అక్కడ ఉన్న నిత్యావసర సరుకులను తీసుకెళ్తుంటాడని, స్కూల్లో ఏమైనా కార్యక్రమాలు జరుగుతుంటే టీచర్స్ అందరూ కలిసి ఆయన ఇంటి వద్దకు వెళ్లి పిలవాలని హుకుం జారీ చేస్తున్నాడని, పాల్–లాబ్‌కు సంబంధించి రూ.22,500 అకౌంట్‌లో పడితే వాటిని డ్రా చేసి తనకు ఇవ్వమంటున్నాడని అర్జీలో పేర్కొన్నారు. సాధారణ బదిలీలపై ఉపాధ్యాయులు వెళ్లిపోతే వారికి తానే బదిలీ చేయించానని ప్రచారం చేస్తున్నాడని, ఎస్‌ఎంసీ చైర్మన్‌కు స్కూల్లో ప్రత్యేకంగా ఒక చాంబర్ ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ×ఇది నా స్కూల్, నాకు తెలియకుండా ఏ పని చేయకూడదÉని ఆదేశాలిస్తున్నాడని, జిల్లా, మండల స్థాయి అధికారులు, ఫారెస్ట్ అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను కూడా ఆయన అనుమతి లేకుండా రానివ్వవద్దంటూ నిప్పులు చెరుగుతున్నాడని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత జనవరిలో గిరిజన బాలికలను అరకులో చలి ఉత్సవాలకు తీసుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారని, ఆ ఉత్సవాలకు వెళ్లే బాలికలతోపాటు తాను కూడా వస్తానని, లేదంటే తనకు ప్రత్యేకంగా కారు కేటాయించి తీసుకెళ్లాలని ఒత్తిడి చేశాడని, అందుకు తాము అనుమతించలేదని డీటీడబ్ల్యూఓకు వివరించారు. బయట గ్రామాల్లో ఆయన కనిపిస్తే నమస్కారం చేసి, బిర్యానీ పెట్టించి, ఖర్చులకు డబ్బు ఇవ్వాలని అడుగుతున్నాడని టీచర్లు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ అరాచకాలను తాము తట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని, వెంటనే తమను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని వేడుకున్నారు.

## నీటి కుంటలో పడి యువకుడు మృతి

- ఉద్యానవనశాఖ సిబ్బంది కొలతల సందర్భంలో ఘటన


మృతి చెందిన రోశయ్య

కురిచేడు: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కురిచేడు మండలంలోని అలవలపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రావి పెద్దకోటయ్య పొలం వద్ద ఉద్యానవనశాఖ నీటి కుంట నిర్మించింది. దాని కొలతల కోసం ఉద్యానశాఖ సిబ్బంది వచ్చారని, తోడుగా రమ్మని కొరివి రోశయ్య(30)ను పెద కోటయ్య తన వెంట తీసుకెళ్లాడు. కుంట కొలతలు తీసేందుకు గట్టుపై మెట్లు చెక్కాలని రోశయ్యను కోరాడు. పనిచేస్తున్న క్రమంలో అలసట తీర్చుకునేందుకు రోశయ్య కట్టపై ఉన్న వేప చెట్టు కింద కూర్చున్నాడు. ఆ సమయంలో ఏమైందో తెలియదు నీటి కుంటలో పడిపోయాడు. రైతుతోపాటు ఉద్యాన సిబ్బంది నీటి కుంటలో దిగి వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, వీఆర్వో రమాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీతో కుంట కట్టకు గండి కొట్టించి నీటిని బయటకు పంపారు. రోశయ్య అప్పటికే మృతి చెందగా మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య గంగాభవాని ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో ఒక అబ్బాయి దివ్యాంగుడు. సంఘటనా స్థలానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.


కుంటకట్టకు జేసీబీతో గండికొడుతున్న దృశ్యం

## మధ్యవర్తిత్వంతో మెరుగైన పరిష్కారం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వం అనేది భవిష్యత్తు రోజుల్లో కక్షిదారుల సమస్యలను మరింత మెరుగ్గా పరిష్కరించనుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా న్యాయస్థానం సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియేషన్ ఫర్ ద నేషన్ అనే కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం అనేది సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదికని అన్నారు. ఈ కార్యక్రమంపై ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. మీడియేషన్‌కు సంబంధించి శిక్షణ ముగించిన న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల సేవా ప్రతినిధులు వారికి అప్పగించిన మీడియేషన్ వ్యాజ్యాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మీడియేషన్‌పై స్థానిక న్యాయవాదులకు శిక్షణ ఇచ్చిన న్యాయవాది ఎస్.అరుణాచలంను అభినందించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి.రాజ్యలక్ష్మి, పి.లలిత, పూర్ణిమ, జి.దీన, టి.రాజా వెంకటాద్రి, సీనియర్ న్యాయమూర్తులు ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, జూనియర్ న్యాయమూర్తులు, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**నేడు కిలోమీటరు నడక**

మధ్యవర్తిత్వ అంశాన్ని కక్షిదారుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ గురువారం చేపట్టిన కిలోమీటరు నడక కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొనాలని ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 8.50 గంటలకు జిల్లా న్యాయస్థానం నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

## మూలికా వైద్య సంఘ జాతీయ అధ్యక్షుడిగా ఇమాంసాహేబ్


నియామకపత్రాన్ని అందుకుంటున్న ఇమాంసాహేబ్

మార్కాపురం టౌన్: వంశపారంపర్య మూలికా వైద్య సంఘ జాతీయ అధ్యక్షుడిగా మార్కాపురం పట్టణానికి చెందిన మూలికా వైద్యుడు షేక్ ఇమాంసాహేబ్ ఎన్నికయ్యారు. రావులపాలెంలో నిర్వహించిన ఆయుర్వేద మూలికా వైద్యుల సమావేశంలో తనతోపాటు కార్యదర్శులుగా రామకృష్ణారెడ్డి, శంకర్, సహాయ కార్యదర్శిగా రాజు, మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారయని ఆయన వివరించారు.

## 13న ఉచిత మెగా వైద్య కంటి శిబిరం

- బూచేపల్లి ట్రస్టు, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో
- సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా..


వైద్య శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ

చీమకుర్తి: బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 13న చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి కమలాకర్‌రెడ్డి పార్కులో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 ఏళ్ల నుంచి సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి వారి సహకారంతో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 13వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు శంకర కంటి ఆస్పత్రి వైద్యులతో నిర్వహించే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హాజరైన రోగులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందిస్తారన్నారు. కంటి ఆపరేషన్‌లు చేయాల్సి వస్తే శంకర కంటి ఆస్పత్రికి బస్సుల్లోఉచితంగా తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి చీమకుర్తిలో వదిలిపెడతారని తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొనే రోగులందరికీ మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కూడా బూచేపల్లి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొలుత ఉచిత మెగా కంటి వైద్య శిబిర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎస్.మాణిక్యం , కౌన్సిలర్‌లు బీమన వెంకట్రావు, సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, ఖాజా, గోపురపు చంద్ర, మేకల యల్లయ్య, బడే అయ్యపరెడ్డి, తెల్లమేకల గాంధీ, చీదర్ల శేషు, కుంచాల రాంబాబు, షేక్ ఖాదర్‌బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

- ఉద్యోగ, కార్మికులకు వ్యతిరేకంగా పాలన
- బ్యాంకు ఉద్యోగుల ధర్నాలో యూనియన్ నాయకుల ధ్వజం


ధర్నా చేస్తున్న బ్యాంకుల ఉద్యోగుల యూనియన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగుల యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఏఐబీఈఏ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని యూనియన్ బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ నుంచి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా ప్రకాశం భవనం వద్ద కార్మిక సంఘాల ధర్నాలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. సుబ్బారావు, కె.రాజీవ్ రతన్‌దో , పి.రామయ్య, ఉమాశంకర్, హాసన్, బ్రహ్మనాయుడు, దుర్గాప్రసాద్, గాయత్రి తదితరులు నాయకత్వం వహించారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగ నాయకులు పీకే రాజేశ్వరరావు, వి.పార్థసారథి, సీబీ రావు, బ్రహ్మయ్య తదితరులు వారి సమ్మెకు సంఘీభావం తెలిపారు.

## విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

పుల్లలచెరువు: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కొండారెడ్డి కొష్టాలు గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన మునగాల శేషరెడ్డి(65) అనే రైతు చౌటపాచర్ల గ్రామ సమీపంలో ఉన్న పొలంలో ట్రాన్స్‌పార్మర్ తీగలు తగిలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై సంతప్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య సీతారావమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.